# ఉపాధి పనులకు వచ్చేలా ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దివాకర

- ఆసక్తి గల కూలీలను గుర్తించాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర

జగిత్యాల, మే 18: జిల్లాలో ఉపాధి హామీ పనులకు పెద్ద సంఖ్యలో కూలీలు వచ్చేలా ప్రోత్సహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం ఆయన ఎంపీడీ పీలు, ఏపీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి పనులకు రావడానికి ఆసక్తి ఉన్న కూలీలను గుర్తించాలని సూచించారు. ప్రతి గ్రామంలో కొత్త పనులను గుర్తించాలని ఆదేశించారు. ఒకే కుటుంబంలో ఎక్కువ మంది పనికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఎక్కువ కుటుంబాలకు 100 రోజుల పని కల్పించడానికి గ్రామాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ట్యాంక్ పనులు, పంట కాలువలు, ఫీడర్ చానల్, పూడిక తీత, రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను జూన్ 12వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వానకాలం సమీపిస్తున్నందున అన్ని గ్రామాల్లో మురుగు కాలువలను శుభ్రం చేయించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలన్నారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు ప్రతి మంగళ, శనివారం గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో రఘువరన్, అదనపు డీఆర్డీవో మదన్‌మోహన్, ఎంపీడీవోలు, ఏపీవోలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఎంపీడీవోలు, ఏపీవోలు

## భూములు, ప్లాట్ల మార్కెట్ విలువ పెంపుదలను నిలిపివేయాలి



సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న రియల్ ఎస్టేట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

కోరుట్ల, మే 18: భూములు, ప్లాట్ల మార్కెట్ విలువ పెంపుదలను నిలిపివేయాలని పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌ను రియల్ ఎస్టేట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా కోరుట్లలో గతంలో గజానికి రూ. 3 వేలు ఉండగా, ఏడాది తిరుగక ముందే గజం విలువ రూ. 4100 పెంచడం సమంజసం కాదని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. భూముల మార్కెట్ విలువ పెంచకుండా ప్రస్తుతం ఉన్న దానినే కొనసాగించాలని విన్నవించారు. ఇక్కడ అసోసియేషన్ ప్రతినిధులు పాయికారి రమేశ్, జంగంపల్లి రాజిరెడ్డి, సిరిపురం లక్ష్మీనారాయణ, మహ్మద్ సలాఉద్దీన్, గంగాధర్, దేవదాసు, లక్ష్మణ్, రమేశ్, శేఖర్, ఇస్మాయిల్ ఉన్నారు.

## ఎల్వోసీ అందజేత

కథలాపూర్, మే 18: మండల కేంద్రానికి చెందిన గంగరాజం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా రూ. 2.50 లక్షల ఎల్వోసీ మంజూరు చేయించారు. కాగా, శనివారం బాధితుడికి ఎల్వోసీ అందజేసినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నాగరాజు పేర్కొన్నారు. ఎమ్మెల్యేకు గంగరాజం కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల రూరల్, మే 18: విదేశీ విద్యానిధి పథకానికి గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31లోగా వెబ్‌సైట్ https \\ overseas. tribak. gov.inలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## విద్యార్థులకు అభినందన

మారుతీనగర్, మే,18: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు, ప్రశంసాపత్రాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు పల్లవి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి తెలిపారు. విద్యార్థులను శనివారం వారు అభినందించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ప్రశాంత్, ఆల్‌రౌండర్ గంగాధర్, నాయకుడు జయకృష్ణ, పీఈటీలు కొమురయ్య, కార్తీక్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



ఆర్డీవో మధుసూదన్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మాస్టర్ ట్రైనర్లు

## ఆర్డీవోకు సత్కారం

జగిత్యాల, మే 18: జగిత్యాల ఆర్డీవో పులి మధుసూదన్ గౌడ్‌ను నియోజకవర్గంలోని మాస్టర్ ట్రైనర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ అరిగెల అశోక్, స్టేట్ లెవెల్ మాస్టర్ ట్రైనర్ డాక్టర్ పడాల తిరుపతి, మాస్టర్ ట్రైనర్లు రాజశేఖర్, శ్రీనివాస్, శరత్ బాబు, సునీల్ కుమార్, డీవీ రామకృష్ణ, అభయ్ రాజ్, ఎం మహేశ్ పాల్గొన్నారు.

జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆధ్వర్యంలో సీనియర్ సిటీజన్లు ఓటేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఆర్డీవో మధుసూదన్‌గౌడ్‌ను శనివారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి వెలముల ప్రకాశ్‌రావు, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, హన్మంత్ రెడ్డి, ఎండీ యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు అశోక్ రావు, సత్యనారాయణ, మానాల కిషన్, సింగం గంగాధర్, చిట్ల గంగాధర్, కందుకూరి సత్యనారాయణ, చిట్ల వెంకన్న, మహిళా ప్రతినిధులు గంగం జలజ, కరుణ పాల్గొన్నారు.



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

# వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

మెట్‌పల్లి, మే 18: పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వాసవీ మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అమ్మవారికి యజ్ఞం, లక్షపుష్పార్చన, తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యమహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైలారపు లింబాద్రి, పట్టణాధ్యక్షుడు మైలారపు రాంబాబు, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ఎలిమి రవి, సంయుక్త కార్యదర్శి కొత్త నవీన్, విద్యాకమిటీ అధ్యక్షుడు పడిగెల శ్రీనివాస్, వాసవి గార్డెన్స్ అధ్యక్షుడు కోట కిరణ్‌కుమార్, వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ కమిటీ అధ్యక్షుడు చాడ సురేశ్, నాయకులు కేదరినాథ్, దొంతుల సంతోష్, పాంపట్టి అరుణ్, శివ, చిట్టిమెల్లి శ్రీనివాస్, చింత లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై జీలుగ విత్తనాలు

పెగడపల్లి, మే 18: పెగడపల్లి, నంచర్ల, నందగిరి సహకార సంఘాల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఏవో వినీల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్సిడీ పోనూ 30 కిలోల బ్యాగ్‌కు రూ.1116 ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. అవసరమున్న రైతులు పట్టా పాసు పుస్తకం తీసుకొచ్చి విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు.

## బీడీ టేకేదారుల కమీషన్ పెంపుపై చర్చలకు ఆహ్వానం

కోరుట్ల, మే 18: తెలంగాణలోని వివిధ బీడీ పరిశ్రమల్లో పని చేస్తున్న టేకేదారుల కమీషన్ పెంపునకు సంబంధించి చర్చలకు పరిశ్రమ యాజమాన్యాలు ఆహ్వానం పంపినట్లు ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సుతారి రాములు తెలిపారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కమీషన్ పెంచాలని బీడీ కంపెనీల యజమానులకు టేకేదారులు డిమాండ్ నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. స్పందించిన బీడీ కంపెనీల యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జితేంద్ర బాయ్ పటేల్, కార్యదర్శి ధర్మేంద్ర గాంధీ ఈనెల 20న నిజామాబాద్‌లో జరిగే చర్చలకు సంఘం ప్రతినిధులను ఆహ్వానించినట్లు చెప్పారు. సమావేశంలో టేకేదారులు సాంబయ్య, బలరాం, రమేశ్, రవి, సత్తయ్య, నర్సయ్య, మల్లేశం, ప్రశాంత్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి పావని

## న్యాయ విజ్ఞాన సదస్సు

కోరుట్ల రూరల్, మే 18: మండలంలోని కల్లూరు గ్రామంలో మండల న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి పావని మాట్లాడుతూ, నిత్య జీవితంలో ఎన్నో సమస్యలుంటాయని వాటిని రాజీమార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్‌రావు, కోశాధికారి రాజశేఖర్, న్యాయవాదులు కొంపల్లి సురేశ్, సదాశివరాజ్, వివేక్, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

పెగడపల్లి, మే 18: గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ ప్రత్యేకాధికారులను ఆదేశించారు. పెగడపల్లి మండలం శాలపల్లి, లింగాపూర్, బతికపల్లి, పెగడపల్లి గ్రామ పంచాయతీలను శనివారం ఆయన సందర్శించారు. గ్రామాల్లోని నర్సరీలు, డంప్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీల్లో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ, అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా రోడ్లపై మురుగు నీరు నిలిచి ఉండకుండా చర్యలు తీసుకోవాలని, రక్షిత మంచినీటి పథకాల్లో తరచూ క్లోరినేషన్ చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, లావణ్య, నిఖిల్‌రెడ్డి, కారోబార్లు స్వామి, మధుకర్ పాల్గొన్నారు.



శాలపల్లి జీపీలో రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో దేవరాజ్

## పారిశుధ్యంపై అవగాహన

మెట్‌పల్లి, మే 18: పట్టణంలోని చావిడి వద్ద మున్సిపల్, పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాకారులతో మెప్మా ఆర్పీలు పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇండ్లల్లోని చెత్తను మున్సిపల్ సిబ్బంది తీసుకువచ్చే ఆటోల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, సిబ్బంది ముజీబ్, నిజామొద్దీన్, అశోక్, నరేశ్, కళా బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాకారులు


నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714-All

CHANGE OF NAME

★I, KALAGIRI MOUNIKA, D/o. Kalagiri Bhoomanna, R/o. 2-22/2, Ramajipet, Raikal, Jagityal, TS. I have Changed after Marriage My Name as AILNENI MOUNIKA, W/o. Ailneni Rajkumar.
NT-334204

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194


## లక్ష్మీనర్సింహ స్వామికి చందనోత్సవం



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకుడు

ధర్మపురి, మే 18: ధర్మపురి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాల శర్మ, ప్రవీణ్‌కుమార్‌శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను అప్రమత్తం చేయాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

వెల్గటూర్, మే 18: వేసవిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని డీఎంహెచ్‌వో శ్రీధర్ వైద్య సిబ్బందికి సూచించారు. ఎండపల్లితో పాటు వెల్గటూర్ మండలం చెర్లపల్లి, ముక్కట్రావుపేట గ్రామాల్లో శనివారం చేపట్టిన ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, వేసవిలో వర్షాలు కురుస్తున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ లవకుమార్, సిబ్బంది రమణ, రక్షిత, జగన్నాథం, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీఎస్ స్థానంలో టీజీ అనే రాయాలి

- జిల్లా అధికారులకు కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశం

కలెక్టరేట్, మే 18: తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్‌కు బదులు టీజీగా ప్రస్తావించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, వాటిని జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు తక్షణమే అమలు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. జిల్లాలో ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ఏజెన్సీలు, స్వయంప్రతిపత్తి గల సంస్థలు, కార్పొరేషన్లు, వెబ్ సైట్‌లు, ఆన్‌లైన్ ప్లాట్ ఫారమ్‌లు.. ఏదైనా ఇతర అధికారిక కమ్యూనికేషన్లు సైతం తెలంగాణ కోడ్‌ను టీఎస్‌కు బదులుగా టీజీ వాడాలని కలెక్టర్ కోరారు. లెటర్ హెడ్లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్ ఫార్మ్స్, పాలసీ పేపర్లు, జీవోలు, ఇతర అధికారిక కమ్యూనికేషన్లన్నింటిపై టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలని సూచించారు. ఆయా శాఖల ద్వారా భవిష్యత్తులో నిర్వహించే ఉత్తర, ప్రత్యుత్తరాల్లో టీఎస్‌కు బదులుగా టీజీని ముద్రించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు తీసుకున్న చర్యలపై 25లోగా అన్ని శాఖల జిల్లా అధికారులు నివేదికలు పంపాలని, వాటిని క్రోడీకరించి ప్రభుత్వానికి పంపనున్నట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ తెలిపారు.

## గ్రూప్-1 ప్రిలిమినరీకి పకడ్బందీ ఏర్పాట్లు

- టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, మే 18: జూన్ 9న జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి ఆదేశించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు సంబంధించిన ఏర్పాట్లపై శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, డీసీపీలతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీసీపీ (లా అండ్ ఆర్డర్) లక్ష్మీనారాయణ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా కలెక్టర్లు, ఎస్పీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలు జరుగకుండా చూసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు కల్పించాలని పేర్కొన్నారు. తగిన నిఘా వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకోవాలని, ఈ మేరకు సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. సెల్ ఫోన్లతోపాటు ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని ఆదేశించారు. కలెక్టర్లు పోలీస్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆయా పరీక్ష కేంద్రాల్లో తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నపత్రాలను ఆయా పోలీస్ హెడ్ క్వార్టర్లలో తగిన బందోబస్తు మధ్య ఉంచాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు వాటిని జాగ్రత్తగా తీసుకెళ్లాలని, పరీక్ష కంటే ముందు ఇన్ టైంలో చేరేలా చూడాలని సూచించారు. జూన్ 9న 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించాలని, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. అభ్యర్థులు ఇన్విజిలేటర్లు సెల్‌ఫోన్లు తీసుకెళ్లకుండా ప్రత్యేక దృష్టి సారించాలని వివరించారు. పరీక్షలకు సంబంధించి ఎలాంటి మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీ జరుగకుండా పకడ్బందీగా వ్యవహరించాలని తెలిపారు. రీజినల్ కోఆర్డినేటర్స్ చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్ష ముగిసే సమయం వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు.

### జిల్లాలో 18,663 మంది అభ్యర్థులు..

కరీంనగర్‌లో గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు 36 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గ్రూప్-1 పరీక్ష ఏర్పాట్లపై వీసీ అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 18,663 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. అభ్యర్థుల బయోమెట్రిక్ వెరిఫికేషన్ క్షుణ్ణంగా నిర్వహించాలని సూచించారు. మే 22న హైదరాబాద్‌లో బయోమెట్రిక్ పోలీస్ ఆఫీసర్లు, పోలీస్ నోడల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. టీఎస్ పీఎస్సీ నిబంధనలకు అనుగుణంగా పరీక్ష జరిగేలా చూడాలని తెలిపారు. దివ్యాంగులు, అంధ అభ్యర్థులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌వో పవన్ కుమార్, డీసీపీ (లా అండ్ ఆర్డర్) లక్ష్మీనారాయణ, జగిత్యాల జేఎన్‌టీయూ కళాశాల ప్రొఫెసర్ బీ సతీశ్ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సృజన్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీ చరణ్, కరీంనగర్ ఉమెన్స్ కాలేజ్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు, రజినీ పాల్గొన్నారు.

## హోటళ్లపై సివిల్ సప్లయ్ అధికారుల దాడులు

విద్యానగర్, మే 18: కరీంనగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న హోటళ్లు, మెస్‌లు, చికెన్ సెంటర్లపై శనివారం సివిల్ సప్లయ్ అధికారులు దాడులు నిర్వహించారు. నగరంలోని కోతిరాంపూర్, కట్టరాంపూర్, భగత్‌నగర్, జ్యోతినగర్, కోర్టు చౌరస్తా తదితర చోట్ల కొనసాగిన ఈ దాడుల్లో గృహ అవసరాలకు వాడుకునే సిలిండర్లను హోటళ్లు, మెస్‌లు, చికెన్ సెంటర్లలో వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఎనిమిది సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పాల్గొన్న డీఎస్‌వో సురేశ్ రెడ్డి మాట్లాడుతూ, గృహ అవసరాలకు వాడుకునే సిలిండర్లను కమర్షియల్‌గా వినియోగించొద్దని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో డిప్యూటీ తహసీల్దార్లు సురేందర్, వేణుగోపాల్, వసంతరావు, ఉషా, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కమలేశ్ పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామి కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే

వీణవంక, మే 18: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరుగగా, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఏటా వీణవంకలో జరిగే శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణం ప్రముఖ వేదపండితుడు గూడ జగదీశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని వీక్షించి, మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని ఏటా స్వామివారి కల్యాణం జరిపించడం హర్షణీయమని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రాయిశెట్టి లత-శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, ఆలయ అర్చకుడు సతీశ్, గోవింద మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి చేయూత

హుజూరాబాద్ రూరల్, మే 18: హుజూరాబాద్ పట్టణంలో నివాసం ఉంటున్న పెంచికల్‌పేటకు చెందిన ఆర్‌ఎంపీ ఇప్పలపల్లి రవీందర్ నెల క్రితం శాలపల్లి-ఇందిరానగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అతడి కుటుంబానికి స్నేహితులు చేయూతనందించారు. రవీందర్‌కు భార్య రేణుక, ఇద్దరు పిల్లలు ఉండడంతో వారి భవిష్యత్తు అవసరాల కోసం తలా కొంత విరాళం వేసుకొని రూ.1,20,500 పోగు చేశారు. ఆ మొత్తాన్ని రేణుక పేరు మీద ఫిక్స్డ్ డిపాజిట్ చేసి శనివారం ఆమెకు బాండ్ అందజేశారు.

## ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

వేములవాడ రూరల్, మే 18: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని శాతవాహన యూనివర్సిటీ వీసీ మల్లేశ్ పేర్కొన్నారు. వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆర్థిక సహకారంతో కళాశాల అకాడమిక్ ఆధ్వర్యంలో అకాడమిక్ ఫెస్టివల్, బంగారు పతకాల ప్రదానోత్సవం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ మల్లేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి రోజుకూ కనీసం ఐదు నుంచి ఆరు గంటలు చదివితే లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. పీజీ ప్రవేశ పరీక్షల్లో విజయం సాధించేలా సన్నద్ధం కావాలన్నారు. అకాడమిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు పున్నశాస్త్రి, సనా, అరుణ్, మేహ, నందిని, రేవతి, రిషీంద్ర, కేజీయా, రజిత, సౌజన్య, సౌమ్య, భార్గవి, రాజు, రఘుప్రసాద్‌కు బంగారు పతకాలు అందించారు.

## స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

వెల్గటూర్, మే 18: ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన నడిగొట్టు సత్తయ్య (46) దక్షిణాఫ్రికా దేశంలోని ఉగాండాలో ఈనెల 15న గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, శనివారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. సత్తయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు నారాయణ కోరారు.

## కనువిందు చేస్తున్న మే పుష్పం

పెగడపల్లి, మే 18: పెగడపల్లి మండలం రాజారాంపల్లి మాజీ ఉప సర్పంచ్ నాగుల రాజశేఖర్‌గౌడ్ ఇంటి ఆవరణలో మే పుష్పం పూసింది. కాగా, పుష్పాన్ని గ్రామస్తులు వచ్చి ఆసక్తిగా తిలకిస్తున్నారు.




పూసిన మే పుష్పం

## కళాజాత ప్రదర్శన

సారంగాపూర్, మే 18: మండలంలోని రేచపల్లి గ్రామంలో శనివారం రాత్రి ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు పోలీస్ కళా బృందం సభ్యులు మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దత్తాద్రి మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్ల మాయామాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. ఎవరైన నమ్మి మోసపోతే డయల్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. పోలీస్ కళాజాత బృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వల్లంపెల్లిలో టీబీ నిర్ధారణ పరీక్షల శిబిరం



టీబీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది, పర్యవేక్షిస్తున్న జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్

మేడిపల్లి, మే 18: మండలంలోని వల్లంపెల్లిలో శనివారం మేడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో టీబీ నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ సందర్శించి, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యుడు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

తెలంగాణచౌక్, మే 18: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో జాప్యంతో కళాశాల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థుల మీద ఒత్తిడి తీసుకొస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.144 కోట్లను విడుదల చేయాలన్నారు.

## యూనిఫాంలు సకాలంలో అందజేయాలి

శంకరపట్నం, మే 18: మహిళా శక్తి స్కీం సభ్యులు విద్యార్థుల స్కూల్ యూనిఫాంలు సకాలంలో అందజేయాలని సెర్ప్ డీపీఎం రవీందర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో టీ-సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా శక్తి స్కీం స్టిచ్చింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నందున జూన్ 7లోగా విద్యార్థుల స్కూల్ యూనిఫాంలు కుట్టి పాఠశాలల్లో అందేలా చూడాలని ఎస్‌హెచ్‌జీ సభ్యులను కోరారు. యూనిఫాం క్లాత్‌ను అందజేశారు.